
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 74 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 06, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్,అక్టోబర్5(నమస్తే ఉదయం):** హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా)కు విస్తృత అధికారాలు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఈ చట్టాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది.జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374(బీ) సెక్షన్‌ను చేర్చుతూ ఆర్డినెన్స్ జారీ అయింది. జలాశయాలు, రోడ్లు, పార్కులు, ఇతర ఆస్తులు కాపాడే బాధ్యత అప్పగించారు. అధికారి లేదా ఏజెన్సీకి అప్పగించే అధికారం ప్రభుత్వానికి కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ అయింది.



## అన్నదాతలకు కేంద్రం శుభవార్త



- రీసెర్చ్ సెంటర్ నుంచి ఉచితంగా విత్తనాల పంపిణీ
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి

**భోపాల్,అక్టోబర్5(నమస్తే ఉదయం):** అన్నదాతలకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ గుడ్‌న్యూస్ చెప్పారు. కొత్త వ్యవసాయ ఉత్పత్తుల కోసం రైతులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇందులో భాగంగా నేషనల్ ఎడిబుల్ మిగతా..2లో

## 2026 నాటికి దేశంలో నక్సలైట్లను పూర్తిగా నిర్మూలిస్తా..!



- మావోల అణచివేతపై హోంమంత్రి చర్చలు

**న్యూఢిల్లీ,అక్టోబర్5(నమస్తే ఉదయం):** 2026 నాటికి దేశంలో నక్సలైట్లను పూర్తిగా నిర్మూలిస్తారా అంటే అవుననే అనిపిస్తుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వ్యూహం కారణంగా, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా దళాలు విజయాన్ని అందుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పటివరకు మిగతా..2లో

## హర్యానాలో కాంగ్రెస్‌కే పట్టం!



- ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు
- పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడి

**న్యూఢిల్లీ,అక్టోబర్5(నమస్తే ఉదయం):** హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ సర్వేలు ప్రకటించాయి. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. కాంగ్రెస్- 55, బీజేపీ- 26, ఐఎన్ఎల్డీ 2-3, జేజేపీ 0-1, ఇండిపెండెంట్లు 3-5 స్థానాలు గెలిచే అవకాశం ఉంది. హర్యానాలో మిగతా..2లో

# మూసీ బాధితులకు పూర్తి భరోసా ..

- వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం
- రాజకీయ పబ్బం గడుపుకునే వారిని నమ్మొద్దు
- రెండులక్షలపైన ఉన్న రుణాలు చెల్లిస్తే.. 2 లక్షలు చెల్లిస్తాం
- పేదల కోసం చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం
- కాకా జయంతి సభలో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,అక్టోబర్6(నమస్తే ఉదయం):** మూసి నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారికి అన్ని విధాలుగా అండగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారందరినీ ఆదుకుంటుందన్నారు. ఎవరినీ అనాథలను చేయబోమన్నారు. ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు.. ఎవరైనా వచ్చి రెచ్చగొడితే వారి మాటలను నమ్మొద్దని, వారి ఫామ్ హౌజ్‌లను కాపాడుకోవడానికే డ్రామాలాడుతున్నారని సీఎం విమర్శించారు. అలాగే రైతు రుణామఫీ కాని వారు కలెక్టరేట్లోఓ దరఖాస్తు చేయాలన్నారు. రెండు లక్షలపైగా ఉన్న రుణాల్లో పై మొత్తం చెల్లిస్తే ప్రభుత్వం 2లక్షలు చెల్లిస్తుందని అన్నారు. ఇంత కచ్చితంగా చెబుతున్నా బిఆర్ఎస్, బిజెపిలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని అన్నారు. రైతులు వారిని నమ్ముకుంటే నట్టేట ముంచుతారని గుర్తుంచుకోవాలన్నారు. శనివారం నాడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. మూసీ నిర్వాసితులు అధైర్య పడొద్దని.. ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు. మూసీ బాధితులకు అండగా ఉన్నట్లు మాట్లాడే వారంతా పేదలకు ఏం చేద్దామో.. వారిని ఎలా ఆదుకుందామో చెప్పాలని కోరారు. ఇళ్లు ఇద్దామా.. డబ్బులు ఇద్దామా.. ప్రభుత్వ స్థలాలు ఇద్దామా.. అని విపక్ష నేతలను సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని నీటి ప్రమాదం నుంచి కాపాడాలని.. ప్రజల మంచి కోసమే ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. మూసీ దగ్గర ఉన్న వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరంలో ఒక్క కుటుంబమే లక్షకోట్లు మింగిందంటూ కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు. మూసి బాధితులు అందరిని ఆదుకోవడానికి పట్టుమని రూ. పదివేల కోట్లు కూడా కావన్నారు. పేదల కోసం పదివేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు సచివాలయానికి రావాలని.. ప్రజలకు ఏం చేద్దామో చర్చిద్దామని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. మూసీ మిగతా..2లో



## వలస కార్మికులపై ఇంత నిర్లక్ష్యమా..!?

- ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ,అక్టోబర్5(నమస్తే ఉదయం):** రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులకు కార్డుల జారీలో జాప్యం చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్రాల తీరు ఆందోళనకరమని, ఈ విషయంలో తమకు ఇక ఓపిక నశించిందని పేర్కొంది. ఈ అంశంలో ఎలాంటి ఉదాసీనతకు చోటులేదని మరోసారి స్పష్టంగా చెబుతు న్నాం. ఇక మాకు ఓపిక నశించింది. మా ఉత్తర్వులను పాటించేందుకు మీకు చివరి అవకాశం ఇస్తున్నాం. లేదంటే మీ కార్యదర్శులు కోర్టుకు రావాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. ఈ వ్యవహారంపై నవంబరు 19లోగా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కొవిడ్ సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని.. సర్వోన్నత న్యాయస్థానం 2020లో దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా.. ఈ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని 2021లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ పక్రియను పూర్తి చేయగా.. మిగతా రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు జాప్యం చేస్తున్నాయి. దీంతో సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది.

## వైభవంగా తిరుమల బ్రహ్మోత్సవాలు

- హంసవాహనంపై వీణాపాణిగా శ్రీవారి దర్శనం
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శనలు

**తిరుమల,అక్టోబర్5(నమస్తే ఉదయం):** శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు శనివారం రాత్రి శ్రీమలయప్పస్వామి వారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ వాహనమైన హంస పరమహంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. అది పాలను, నీళ్లను వేరుచేయగలదు. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. అందుకే ఉపనిషత్తులు హంసను పరమేశ్వరునిగా అభివర్ణిస్తున్నాయి. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా అహంభావాన్ని తొలగించి దాసోహ భావాన్ని (శరణాగతి) కలిగిస్తాడని భక్తుల విశ్వాసం. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని వాహనసేవలో దర్శించుకున్నారు. హంస వాహన సేవలో శ్రీ మలయప్పస్వామి వారు జ్ఞానమూర్తిగా ప్రకాశిస్తాడు. ఐతిహ్యానుసారం బ్రహ్మ వాహనమైన హంస జ్ఞానానికి ప్రతీక.అందుకే ఉపనిషత్తులు పరమాత్మతో సంయోగం చెందిన మహనీయులను పరమహంసగా అభివర్ణిస్తున్నాయి. శ్రీవారు భక్తులలో అహంభావాన్ని తొలగించి జ్ఞానసిద్ధి, బ్రహ్మపద ప్రాప్తి కలిగించేందుకే హంస వాహనాన్ని అధిరోహిస్తాడని పురాణాలు ఘోషిస్తున్నాయి.వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన శనివారం రాత్రి హంస వాహన సేవలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించాయి. ఐదు రాష్ట్రాలకు చెందిన కళాకారులు మిగతా..2లో



## రేవంత్ సహా మంత్రులను వదిలేది లేదు

- పరువు నష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తాం
- రైతులను మోసం చేసి ఆగం పట్టించారు
- మూసీ బాధితులకు నిద్రలేకుండా చేశారు
- కందుకు రైతు ధర్నాలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



**రంగారెడ్డి,అక్టోబర్5(నమస్తే ఉదయం):** దిక్కుమాలిన మాటలు,రోతపుట్టించే మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన మిగతా..2లో

## సౌదీ ఎడారి నుంచి స్వదేశానికి నిర్మల్ జిల్లావాసి


- సీఎం చొరవతో సౌదీ బాధితుడు రాథోడ్ నాందేవ్‌కు విముక్తి
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు రాథోడ్ నాందేవ్.

**హైదరాబాద,అక్టోబర్5(నమస్తే ఉదయం):** కువైట్ – సౌదీ అరేబియా సరిహద్దుల్లోని ఎడారిలో ఒంటెల కాపరిగా కష్టాలు అనుభవించిన నిర్మల్ జిల్లావాసి రాథోడ్ నాందేవ్ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చొరవతో ఇటీవల రియాద్ నుంచి హైదరాబాద్‌కు క్షేమంగా చేరుకున్నాడు. మిగతా..2లో



## కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల

- 9.4కోట్లు రైతుల ఖాతాల్లో రూ.20వేలకోట్లు జమ
- మహారాష్ట్రలో ప్రారంభించిన ప్రధాని మోడీ



**ముంబై,అక్టోబర్6(నమస్తే ఉదయం):** ప్రధాని నరేంద్ర మోదీ కిసాన్ సమ్మాన్ నిధి విడుదల చేశారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నిధుల విడుదలను ప్రారంభించారు. 18వ విడుతలో 9.4కోట్ల మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.20వేలకోట్లు జమ కానున్నాయి. ఈ సందర్భంగా నమో షెత్కారీ మహాసమ్మాన్ నిధి యోజన సైతం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6వేల చొప్పున మూడు విడుతల్లో కిసాన్ సమ్మాన్ నిధిని నేరుగా రైతుల ఖాతాల్లో సమ చేస్తున్న విషయం తెలిసిందే. తొలి విడుతలో ఏప్రిల్ జూలై మధ్య.. రెండో విడుతలో ఆగస్టు- నవంబర్.. మూడో విడుతలో డిసెంబర్-మార్చి మధ్య కేంద్రం సాయాన్ని రైతులకు అందిస్తున్నది. ఇక ఇప్పటి వరకు రూ.3.45 లక్షల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కిసాన్ నిధులు సమ కాని రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని.. ఇందు కోసం అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కేంద్ర సూచించింది. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ పాల్గొన్నారు. వెబ్‌కాస్ట్ ద్వారా దేశ వ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన కేంద్రాలు (కెవికెలు), 1 లక్షకు పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్‌లతో సహా దాదాపు 2.5 కోట్ల మంది రైతులు ఈ మిగతా..2లో

## చెరువు కబ్జా.. ఎన్ కన్వెన్షన్ నిర్మాణం

- నాగార్జునపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- మాదాపూర్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు

**హైదరాబాద్,అక్టోబర్5(నమస్తే ఉదయం):** అక్కినేని నాగార్జున పై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. తమ్మిడికుంట చెరువు కబ్జాచేసి ఔకన్వెన్షన్ నిర్మించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. మాదాపూర్ పోలీసులకు జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి మిగతా..2లో



## తిరుమలలో వీఐపి సంస్కృతి తగ్గాలి

- వీఐపిల కోసం అనవసర హడావిడి చేయరాదు
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పరిసరాలు ఉండాలి
- తిరుమల పవిత్రత పెంచి..నమ్మకం కలిగించాలి
- ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలి
- భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళికలు చేయాలి
- కొండల్లో అటవీప్రాంత విస్తీర్ణం పెరిగేలా చేయండి
- భక్తుల ఫిర్యాదులు, అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- తిరుమల అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష



**తిరుమల,అక్టోబర్5(నమస్తే ఉదయం):** తిరుమలలో వీఐపీ సంస్కృతి తగ్గాలని సీఎం చంద్రబాబు టీటీడీని అదేశించారు. ప్రముఖులు వచ్చినప్పుడు హడావుడి కనిపించకూడదన్నారు. సింపుల్‌గా, ఆధ్యాత్మిక ఉట్టిపడే పరిసరాలు ఉండాలి తప్ప ఆర్భాటం, అనవసర వ్యయం మిగతా..2లో

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):**
పట్టణపరిధిలోని దౌదర్‌పల్లి సమీపంలో నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇండ్లను శనివారం జిల్ల కలెక్టర్ బిఎం సంతోష్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రకాల సదుపాయాలతో సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు, డ్రైనేజ్ వ్యవస్థ, సెప్టిక్ ట్యాంక్, పరిసరాల సుందరీ కరణ వంటి మౌలిక వసతులు అన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఎలక్ట్రిసిటీ డిఇ లక్ష్మీనాయక్, పంచాయతీరాజ్ ఈ.ఈ దామోదర్ రావు, పంచాయత్ రాజ్ డి.ఈ. లక్ష్మన్న, ఇరిగేషన్ ఈఈ గ్రిడ్ శ్రీధర్ రెడ్డి, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## 2026 నాటికి దేశంలో నక్సలైట్లను పూర్తిగా నిర్మూలిస్తా..!

(మొదటి పేజీ తరువాయి)
గత 9 నెలల్లో అనేక దాడులు జరుగగా, సెప్టెంబర్ వరకు 723 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇది కాకుండా భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 202 మంది నక్సలైట్లు మరణించగా, 812 మంది నక్సలైట్లను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో 2026 నాటికి నక్సలైట్లను పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అంటే అప్పటికి దేశంలో నక్సలైట్ల కార్యకలాపాలు కనిపించే ప్రాంతం ఏమీ ఉండదని చెప్పవచ్చు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇది కాకుండా వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో రాష్ట్రాలకు మద్దతు ఇస్తున్న 5 మంది కేంద్ర మంత్రులు, కేంద్ర మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్, రాష్ట్రాల సీనియర్ అధికారులు కూడా ఈ భేటీకి హాజరవుతారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో మార్చి 2026 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సమస్యను కట్టడి చేసేందుకు వామపక్ష తీవ్రవాదంతో ప్రభావితమైన అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయాన్ని అందిస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గతేడాది వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చివరిసారిగా సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆ సమావేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపేందుకు హోంమంత్రి సమగ్ర మార్గదర్శకాలు ఇచ్చారు. మోదీ ప్రభుత్వ వ్యూహం కారణంగా 2010తో పోలిస్తే 2023లో హింస 72 శాతం, మరణాలు 86శాతం తగ్గాయని చెబుతున్నారు.
దీంతో వామపక్ష తీవ్రవాదం ప్రస్తుతం చివరి పోరాటం చేస్తోంది. 2024లో నక్సలైట్లపై భద్రతా బలగాలు అపూర్వ విజయాన్ని సాధించాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 202 మంది నక్సలైట్లు హతమయ్యారు. 2024 మొదటి 9 నెలల్లోనే 723 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దీంతో 2024 నాటికి వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్య 38కి తగ్గనుంది. వామపక్ష తీవ్రవాదంతో ప్రభావితమైన రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలకు కూడా అభివృద్ధి పథకాలను తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతాల్లో రోడ్డు, మొబైల్ కనెక్టివిటీకి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. లెఫ్ట్ వింగ్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు 14,400 కిలోమీటర్ల రోడ్లు నిర్మించగా, దాదాపు 6000 మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు.

## రేవంత్ సహా మంత్రులను వదిలేది లేదు

(మొదటి పేజీ తరువాయి)
మంత్రివర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా త్వరలోనే పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. దిక్కుమాలిన నోటలు, రోత పుట్టించే మాటలు మాట్లాడే ముఖ్యమంత్రిని విడిచిపెట్టం. నాపై ఆరోపణలు చేసిన మంత్రిపై ఆల్రెడీ పరువు నష్టం దావా వేశాను. ముఖ్యమంత్రి మీద కూడా తొందర్లనే వేస్తా.. అడ్డగోలుగా మాట్లాడిన మంత్రిగారిని విడిపెట్టను.. క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టను. అటు క్రిమినల్, ఇటు సివిల్ డిఫమేషన్ రెండు సూట్లు వేస్తాను.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తప్పే చేయనుప్పుడు ఎవని అయ్యకు కూడా భయపడం. ఏం చేసుకుంటవో చేస్కో అని మోదీకే చెప్పినం. ఈ చిట్టి నాయుడు ఎంత మనకు.. అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయిండు. ఇక ఆగుతలేడు. పెద్దోని అయిపోయానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు అని కేటీఆర్ మండిపడ్డారు. సబితక్క ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయట. మరి అవి ఎక్కడున్నాయో చెబితే మేమే కూలగొడుతాం. సబితక్క బిడ్డకు కూడా ఉందట. అది కూడా చూపిస్తే కూలగొడుతాం. మాట్లాడితే కూలగొడుతా అంటున్నావ్.. అది నీ ఇష్టం. రేవంత్ రెడ్డి నీ కళ్లు చల్లబడుతాయి అనుకుంటే.. మావి కూలగొట్టి అక్కడికి ఆపేయ్. పేదవాళ్లవి మాత్రం కూలగొట్టకు.. వారి ఇండ్లను ముట్టుకోవడం బంద్ చేయ్. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక దిక్కేమో రైతు గోస.. హైదరాబాద్ పోతే మూసీ బాధితుల రోదన. మూసీ పరివాహక ప్రాంతంలో 50 ఏండ్ల నుంచి ఇల్లు కట్టుకుంటే ఆక్రమణదారులు, కబ్జాదారులు అంటున్నాడు రేవంత్ రెడ్డి. మీ కాంగ్రెస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్లు చేసే.. ఇన్ని రోజులు పైసలు దొబ్బితింటివి. ఇప్పుడేమో కబ్జాకోరులు అని మాట్లాడుతున్నావు. నీకు చిత్తశుద్ధి ఉంటే.. కొడంగల్‌లోని రెడ్డి కుంటలో నీ సొంత ఇల్లు ఉంది.. దమ్ముంటే దాన్ని కూలగొట్టి.. పేదోళ్ల వద్దకు రా అని సవాల్ చేస్తున్నా. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మీ అన్న తిరుపతి రెడ్డి ఇల్లు కూలగొట్టు. అప్పటికీ కడుపు మంట చల్లారకంటే మావి కూలగొట్టు.. కానీ పేదల ఇండ్ల వద్దకు రావొద్దని కేటీఆర్ చెప్పారు. నీకు పైసలు, కమిషన్లు కావాలి. రాహుల్‌గాంధీకి పంపాలి.. కుర్చీ కాపాడుకోవాలి. నీ బాధ అర్థమవుతుంది. నీకు అంత పైసల పిచ్చి ఉంటే.. నాలుగు కోట్ల మందిమి చందాలు వేసుకునే నీ ముఖాన కొడుతాం. కానీ పేదల ఇండ్లు కూలగొట్టకు.. చందా పైసలను తీసుకెళ్లి ఢిల్లీకి కప్పం కట్టి.. ముఖ్యమంత్రి పదవి కాపాడుకో అని కేటీఆర్ సూచించారు. ఇకపోతే మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ కోసం లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడుతా అంటుండు. రైతుబంధు, ఆసరా పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవట. కానీ లక్షా 50 వేల కోట్లు మూసీలో పోస్తాడట. ఎందుకో తెలుసా..? రైతుబంధు, పెన్షన్లు, తులం బంగారం ఇస్తే మీరు కమిషన్ ఇవ్వరు. కానీ అదే మూసీలో 30 వేల కోట్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపాలి. అందుకు మూసీ పథకం పెట్టిండు. కేసీఆర్ కాళేశ్వరం కట్టిండు, పాలమూరు 90 శాతం కట్టిండు. నీళ్లు ఇచ్చేందుకు కట్టిండు. మరి మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తావు?? సమాధనం ఉందా..? అంటే లేదు. కమిషన్లు దొబ్బేందుకు ఎలాన్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఆయనకు కమిషన్ల పిచ్చి పట్టింది. బీఆర్ఎస్ హయాంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీకి సేకరించాం. ఇదే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోదండ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, రేవంత్ రెడ్డి ఊరురు తిరిగి చెప్పింద్రు.. బస్సు యాత్రలు పెట్టి చెప్పింద్రు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేసి తిరిగి రైతులకు భూములు ఇస్తామన్నారు. కానీ మాట మార్చారు. ఫార్మా సిటీ పేరు మార్చి ఫోర్త్ సిటీ అని పెట్టిండు. ఇంకోటి ఫ్యూచర్ సిటీ అట. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో రాష్ట్ర ప్రభుత్వమే పనులు చేస్తదట. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలో కమిషన్లు, కాంట్రాక్టుల కోసం అలైన్‌మెంట్ మార్చి తమ భూములను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా పని చేస్తున్నాడు.. ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. మాట్లాడితే మూసీ, హైడ్రా అంటున్నాడు. చేయాల్సింది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లనే ఉంది. వాళ్ల నెత్తుల నిండా గబ్బు ఉన్నదని కేటీఆర్ విమర్శించారు.

# హర్యానాలో కాంగ్రెస్‌కే పట్టం!

(మొదటి పేజీ తరువాయి)
మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అధికారం చేపట్టాలంటే 46 సీట్లు కైవసం చేసుకోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉన్నట్లు పీపుల్స్ పల్స్ ప్రకటించింది. తన ప్రత్యర్థి బీజేపీపై 7 నుంచి 8 శాతం ఓట్ల ఆధిక్యత ప్రదర్శించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి 45 శాతం, బీజేపీకి 38 శాతం, ఐఎన్ఎల్డీ–బీఎస్పీ కూటమికి 5.2 శాతం, ఆప్ పార్టీకి 1 శాతం, జేజేపీకి 1 శాతం లోపు, ఇతరులకు 10 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. సీఎం ఎవరైతే బాగుంటుందన్న అంశంపైనా ప్రజలు తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారు. సీఎల్పీ లీడర్ భూపీందర్ సింగ్ హూడాకు 39 శాతం, సిట్టింగ్ సీఎం నయాబ్ సింగ్ సైనీకి 28 శాతం, కాంగ్రెస్ ఎంపీ కుమారీ సెల్జాకు 10 శాతం, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు 6 శాతం మంది ఈ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి కావాలని మద్దతిస్తున్నారని పీపుల్స్‌పల్స్ పేర్కొంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఉంటుందని పీపుల్స్ పల్స్ సర్వే పేర్కొంది.

ప్రాంతీయ పార్టీలు ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జననాయక్ జనతా పార్టీలు బలహీనపడ్డాయని సర్వే నివేదికలో పేర్కొంది. ఈ ఎన్నికల్లో స్థానిక అంశాలు ప్రభావితం చేశాయని అంచనా వేసింది. స్థానిక ఎమ్మెల్యే పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల ఆధారంగా ప్రజలు ఓటు వేశారని పీపుల్స్ పల్స్ తెలిపింది. ఓటర్లు జాతీయ అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రధాని మోదీ ప్రభావం ఈ ఎన్నికల్లో కనిపించలేదు. వీటికి తోడు.. నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, రైతు సమస్యలు, ధరల పెరుగుదల.. హర్యానాలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతకు తోడుగా రాష్ట్రంలో రైతులు, రెజ్లర్లు, యువత బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నట్టు పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడయింది. ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ పార్టీకే హర్యానా ప్రజలు పట్టం గట్టినట్లు చెబుతున్నాయి. పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. హర్యానాలో ప్రధాన పోటీ జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఉంది. ప్రాంతీయ పార్టీలు ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జననాయక్ జనతా పార్టీలు బలహీనపడ్డాయి. ఈ ఎన్నికల్లో స్థానిక అంశాలు కీలకపాత్ర పోషించాయి. స్థానిక ఎమ్మెల్యే పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల ఆధారంగా ప్రజలు ఓటు వేశారని –పీపుల్స్ పల్స్ వెల్లడించింది. ఓటర్లు జాతీయ అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రధాని మోదీ ప్రభావం ఈ ఎన్నికల్లో కనిపించలేదు. నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, రైతు సమస్యలు, ధరల పెరుగుదల.. హర్యానాలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి–. పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతకు తోడుగా రాష్ట్రంలో రైతులు, రెజ్లర్లు, యువత బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నట్టు పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడయింది.

# తిరుమలలో వీఐపి సంస్కృతి తగ్గాలి

(మొదటి పేజీ తరువాయి)
వద్దని సూచించారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని చంద్రబాబు హితవు పలికారు. తిరమలలోని పద్మావతి అతిథి గృహంలో టీటీడీ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో శ్యామల రావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి సహా ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సూచనలు చేశారు. కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని గట్టిగా చెప్పారు. ప్రశాతంతకు ఎక్కడా భంగం కలగకూడదన్న చంద్రబాబు.. ఏ విషయంలో కూడా రాజీ పడొద్దని ఆదేశించారు. ఈ మధ్య కాలంలో జరిగిన రాజకీయ హడావుడిని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు ఈ సూచన చేసినట్టు కనిపిస్తోంది. భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లు నీటి లభ్యత ఉండేలా చూసుకోవా లని తిరుమల తిరుపతి దేవస్థాన అధికారులను అప్రమత్తం చేశారు చంద్రబాబు. ముందస్తు ప్రణాళికు సిద్ధం చేయాలన్నారు. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతంపైగా పెంచాలని అధికారులకు సూచించారు అటవీ సంరక్షణతోపాటు అడవుల విస్తరణ కోసం వచ్చే 5 ఏళ్లకు ప్రణాళికు రూపొందించాలని అన్నారు. బయోడైవర్సిటీ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలన్నారు. అత్యుత్తమ పదార్థాలు మాత్రమే వాడాలని సూచించారు. టీటీడీ సిబ్బంది భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్న సీఎం... దేశ విదేశాల నుంచి వచ్చేవారు హ్యాపీగా వెళ్లేలా చూడాలన్నారు. దురుసు ప్రవర్తన అనేది ఎక్కడా ఉండకూడదని హెచ్చరించారు. భక్తులు సంతృప్తితో, అనుభూతితో కొండ నుంచి తిరిగి వెళ్లాలని హితవు పలికారు. తిరుమల పేరు తలిస్తే ఏడుకొండల వాడి వైభవం, ఆధ్యాత్మిక మాత్రమే చర్చకు రావాలన్నారు. స్విమ్స్ సేవలు కూడా మెరుగుపరచాలన్నారు.ఇదొక ప్రత్యేకమైన క్షేత్రమని... తిరుమల పవిత్రత కాపాడడం, ఆధ్యాత్మిక విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సమీక్ష అనంతరం తిరుమలలో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. తిరుమల గిరుల్లో గోవింద నామాలే వినిపించాలని అధికారులకు స్పష్టం చేశారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా పనిచేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. తిరుమల కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతిలో ప్రశాతంతకు భంగం కలగకూడదు తేల్చి చెప్పారు. భక్తుల మనోభావాలకు సంబంధించి ఏ విషయంలోనూ రాజీ పడొద్దని కుండబద్దలు కొట్టారు. తిరుమలలో అందిస్తోన్న సేవలపై భక్తుల నుంచి స్పందన గురించి అధికారులను సీఎం చంద్రబాబు అడిగారు. తిరుమల వచ్చిన ప్రతి భక్తుడి అనుభవాల గురించి అభిప్రాయం చెప్పే అవకాశం కల్పించాలని సూచించారు. భక్తుల సలహాలు, సూచనలతో మరింత మెరుగ్గా సేవలు అందించొచ్చని పేర్కొన్నారు. ఒక్క తిరుమలలోనే కాక మిగతా ఆలయాల్లో కూడా భక్తుల అభిప్రాయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి సూచించారు.

తిరుమల లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత పెరిగిందని భక్తులు అంటున్నారు. ఇది ఇలానే కొనసాగాలి, సేవలు మరింత మెరుగుపడాలని సీఎం చంద్రబాబు అభిప్రాయ పడ్డారు.

# మూసీ బాధితులకు పూర్తి భరోసా..

(మొదటి పేజీ తరువాయి)
విషంతో బతుకుతున్న నల్లగొండను ఎలా ఆదుకోవాలో చర్చిద్దామన్నారు. ఇలాగే వదిలేసి మూసీని మూసేద్దామా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సబర్మతి రివర్ ఫ్రంట్ కోసం 64 వేల కుటుంబాలను తరలించారని.. కేవలం 16వేల కుటుంబాలకే పరిహారం ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటిదే హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ చేస్తే ఈటెల రాజేందర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.
బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ. 1,500 కోట్లు ఉన్నాయని.. అందులోంచి మూసీ బాధితులకు రూ. 500 కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. ఈ డబ్బులను మూసీ నిర్వాసితులకు పంచిపెడదా మన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు ఉందని.. అందులోకి 500 ఎకరాలు దానం చేస్తే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని సీఎం అన్నారు. కేటీఆర్‌కు జన్వాడలో 50 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని.. అందులో 25 ఎకరాలు ఇవ్వాలన్నారు. 'ఇవన్నీ దోచుకున్నవే కదా? మీ తాతల నుంచి వచ్చినవి కాదు కదా 2009 నుంచి మీ ఆస్తులు ఎలా పెరుగుతూ వచ్చాయి.' అని కేటీఆర్‌ను సీఎం రేవంత్ ప్రశ్నించారు. రేస్ కోర్సు బయటకు తరలిద్దామని.. అంబర్‌పేటలో ఉన్న పోలీస్ అకాడమీని బయటకు తరలిద్దామన్న సీఎం.. అందులో పేదలకు ఇళ్లు కట్టిద్దామని చెప్పారు. పేదలకు న్యాయం చేయడానికి ఒక కమిటీని వేస్తామని.. అందులో ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమిస్తామన్నారు. పేదల బాధ తనకు తెలుసునని.. ఏ పని చేసినా అడ్డుపడొద్దని రేవంత్ విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ దీక్షపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రెండు లక్షల వరకు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేశామని సీఎం పునరుద్ఘాటించారు. రెండు లక్షలపైన రుణం ఉన్న వారికి.. పైన డబ్బులు కడితే మిగతావి ఇస్తామని చెప్పామన్నారు. రుణమాఫీ జరగలేదని కేటీఆర్ దీక్ష చేపట్టారని విమర్శించారు. రెండు లక్షల పైనున్న వాళ్లకు మాత్రమే రుణమాఫీ జరగలేదని సీఎం వివరించారు. రైతులు ఎవరూ వీరిని నమ్మొద్దని హితవు చెప్పారు రేవంత్. ఏమైనా సమస్యలుంటే కలెక్టర్‌ను కలిసి అడగాలని.. సమస్యను పరిష్కరిస్తారన్నారు. సోషల్ మీడియాతో అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారని.. చిల్లర పనులు చేస్తే చర్లపల్లి జైలుకు వెళతారని చురకలంటించారు సీఎం. ఇదే సమయంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవిపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో వెంకట స్వామి కుటుంబం పాత్ర ఖచ్చితంగా ఉంటుందన్నారు. అంతేకాదు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మరుగున పడొద్దని కాకా ఆలోచించారన్నారు. సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీని ఒప్పించి టీఆర్ఎస్‌తో పొత్తు కుదిర్చారన్నారు. టీఆర్ఎస్‌కు 42 ఎమ్మెల్యే, 5 ఎంపీ సీట్లు ఇప్పించడానికి ప్రధాన కారణం కాకానే అని అన్నారు. కాకా వల్లనే ఆనాడు బీఆర్ఎస్(టీఆర్ఎస్) బలపడిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అసూయతో కాకాను వదిలేశారని సీఎం విమర్శించారు. మల్లిఖార్జున ఖర్గే సూచనతో వివేక్ వెంకటస్వామిని తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చానని రేవంత్ రెడ్డి చెప్పారు.

వెంకటస్వామి సూచన మేరకే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టారని.. తుమ్మిడి హట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మన కళ్లముందే కట్టడం, కూలిపోవడం కూడా జరిగిందని సీఎం విమర్శించారు.

## అన్నదాతలకు కేంద్రం శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)
ఆయిల్ మిషన్ చొరవతో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అభివృద్ధి చేసిన బ్రీడర్, సర్టిఫైడ్ ,ఫౌండేషన్ విత్తనాలను ఉచితంగా అందించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని శివరాజ్‌సింగ్ తెలిపారు. నూనె గింజల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన 21 రాష్ట్రాల్లోని 347 జిల్లాలపై దృష్టి సారించి దేశవ్యాప్తంగా 600 క్లస్టర్లలో రైతులకు ఉచితంగా బ్రీడర్, సర్టి÷డ్ మరియు ఫౌండేషన్ విత్తనాలను ప్రభుత్వం అందజేస్తుందని వ్యవసాయ మంత్రి తెలిపారు. భోపాల్‌లో కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. భారతదేశం అంతటా వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి మరియు రైతులను ఆదుకోవడానికి ఉద్దేశించిన అనేక ముఖ్యమైన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. నేషనల్ ఎడిబుల్ ఆయిల్ మిషన్ (ఎన్ఎంఈఓ–ఆయిల్‌సీడ్స్) కింద రైతులకు ఉచితంగా బ్రీడర్ విత్తనాలు, సర్టి÷డ్ విత్తనాలు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన ఫౌండేషన్ విత్తనాలను అందించాలని ప్రభుత్వం యోచిస్తోందని ఆయన చెప్పారు. నూనెగింజల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన 21 రాష్ట్రాల్లోని 347 జిల్లాలపై దృష్టి సారించి దేశవ్యాప్తంగా 600 క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతాల్లోని రైతులు ఉచిత విత్తనాలను అందుకోవడమే కాకుండా దిగుబడిని పెంచడానికి అధునాతన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇస్తామని చెప్పారు. రైతులు పండించిన ఉత్పత్తులను 100 శాతం కొనుగోలు చేసేలా చూస్తామని వెల్లడించారు. ఎడిబుల్ ఆయిల్స్‌పై దిగుమతి సుంకం విషయంలో ఇటీవలి నిర్ణయాలు దేశీయ ఉత్పత్తి మరియు ధరలను సానుకూలంగా ప్రభావితం చేస్తున్నాయని చౌహాన్ తెలిపారు. సోయాబీన్, ఆవాలు, పొద్దుతిరుగుడు వంటి ఎడిబుల్ ఆయిల్‌లపై గతంలో 0శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని ఇప్పుడు 27.5శాతంకి పెంచినట్లు వివరించారు. న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి రైతుల నుంచి సోయాబీన్‌ను కొనుగోలు చేస్తుందన్నారు.

## వైభవంగా తిరుమల బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)
18 కళాబృందాలు 511 మంది కళాకారులు ప్రదర్శన లిచ్చారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులచే భరతనాట్యం, మహారాష్ట్ర కు చెందిన గీతా బృందం కథక్ నృత్యం ప్రదర్శించారు. కర్నాటకకు చెందిన డాక్టర్ రక్షాకార్తిక్ దీప నృత్యం కనువిందు చేసింది. పంజాబ్ రాష్ట్రానికి చెందిన అజయ్ బృందం తప్ప నృత్యంతోను, బెంగళూరుకు చెందిన సుజేంద్ర బాబు బృందం దశావతారం రూపకంతోను అలరించారు. మహారాష్ట్రకు చెందిన నరేంద్ర బృందం బంగ్రా నృత్యంతోను, హైదరాబాద్ కు చెందిన అర్చన బృందం పద్మావతీ పరిణయంతోను, బెంగళూరు చెందిన అనన్య బృందం కాళింగమర్ధనం రూపకంతోను, బెంగళూరుకు చెందిన తరుణారెడ్డి బృందం మయూర నృత్యంతోను, కర్నాటకకు చెందిన విజయలక్ష్మి బృందం కురవంజి నృత్యం తోను, కర్నాటకకు చెందిన మహేష్ కూమార్ డొల్లుకునిత కళా విన్యాసంతోను, రాజస్థాన్ కు చెందిన రామ్ బృందం నౌవ్ట్ర కళా విన్యాసంతోను, తమిళనాడుకు చెందిన ధరణి కశ్యప్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతోను, తిరుపతి పట్టణానికి చెందిన డాక్టర్ మురళీ కృష్ణ బృందం మోహినియాట్టంతోను, తూర్పు గోదావరి, హైదరాబాద్, తిరుపతికి చెందిన వీరవేణి, శివలక్ష్మి, తులసీపద్మ, బృందాలు కోలాటాలతో అలరించారు.

## సౌదీ ఎడారి నుంచి స్వదేశానికి నిర్మల్ జిల్లావాసి

(మొదటి పేజీ తరువాయి)
నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రూవి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ అనే గిరిజనుడు ఇంటిపని వీసాపై కువైట్ వెళ్లాడు. అరబ్బు యజమాని అతన్ని కువైట్ నుంచి అక్రమంగా సౌదీకి తరలించి ఒంటెల కాపరి పని చేయించాడు. యజమాని హింసను తట్టుకోలేకపోతున్నానని, నిత్యం నరకం అనుభవిస్తున్నానని, ఎడారి నుంచి నన్ను రక్షించండి అంటూ రాథోడ్ నాందేవ్ ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డిని వేడుకుంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పంపిన ఒక సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ జీఏడీ ఎన్నారై శాఖ అధికారులు కువైట్, సౌదీ అరేబియా రెండు దేశాల్లోని ఇండియన్ ఎంబసీలతో, అక్కడి సామాజిక సేవకులతో, ఢిల్లీలోని విదేశాంగ శాఖతో సమన్వయం చేసి నాందేవ్ ను రక్షించి స్వదేశానికి వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి, కాంగ్రెస్ ఎన్నారై సెల్ నాయకులు మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, నంగి దేవేందర్ లతో పాటు గల్ఫ్ బాధితుడు రాథోడ్ నాందేవ్ తన కుటుంబ సభ్యులతో శనివారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)
కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పీఎం కిసాన్ నిధుల విడుదల రోజును.. పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌గా జరుపుకుంటూ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించి.. తద్వారా వారి జీవనోపాధిని పెంచడానికి ప్రభుత్వం చేస్తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని 24 ఫిబ్రవరి 2019న ప్రారంభించారు. ఈ పతకం కింద భూమి కలిగిన ప్రతి రైతుకు మూడు సమాన వాయిదాల చొప్పున సంవత్సరానికి రూ. 6,000 అందిస్తోంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో భాగంగా ఇప్పటి వరకు 18 విడతలు నిధులు పంపిణీ చేయగా.. ఈ మొత్తం రూ. 3.45 లక్షల కోట్లు దాటిందని, దేశ వ్యాప్తంగా 11 కోట్ల మందికి పైగా రైతులు లబ్ధి పొందారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## చెరువు కబ్జా.. ఎన్ కన్వెన్షన్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)
భాస్కరరెడ్డి ఫిర్యాదు చేశారు. నాగార్జునపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని భాస్కరరెడ్డి పోలీసులను కోరారు. లీగల్ ఒపీనియన్‌కు పంపించారు మాదాపూర్ పోలీసులు. నాగార్జునకు చెందిన ఔ కన్వెన్షన్‌ను ఇటీవలే కూల్చివేసిన విషయం తెలిసిందే. చెరువును కబ్జా చేసి ఔ కన్వెన్షన్ నిర్మించారని హైడ్రా దాన్ని కూల్చివేసింది. తుమ్మిడికుంట చెరువులో 3 ఎకరాల 30 గుంటల భూమిని ఆక్రమించి ఔ కన్వెన్షన్ కట్టారని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. కాగా దాని పై హైడ్రాకు మరోసారి ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. చెరువు ఆక్రమణకు గురైనట్టు నిర్ధారించి..కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య.. జంబో జేసీబీలతో కన్వెన్షన్‌ను గంటల వ్యవధిలోనే అధికారులు కూల్చివేశారు. కాగా దీని పై నాగార్జున స్పందిస్తూ.. ఆ భూమి పట్టా భూమి అని.. ఒక్క అంగుళం ట్యాంక్ ఎలాన్ కూడా ఆక్రమణకు గురికాలేదన్నారు.. ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనమిదని.. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై స్టే కూడా మంజూరు చేసినట్లు నాగార్జున తెలిపారు. తాజాగా ఇప్పుడు మరోసారి నాగ్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు కసిరెడ్డి భాస్కరరెడ్డి. మరి దీని పై నాగార్జున ఎలా స్పందిస్తారో చూడలి. మరోవైపు మంత్రి కొండా సురేఖ సమంత, అక్కినేని ఫ్యామిలీ పై కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. దాంతో కొండా సురేఖ పై నాగ్ లీగల్ యాక్షన్ కు సిద్ధమయ్యారు.



బుద్వేల్‌లో బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న ఆ పార్టీ నాయకులు

# బుద్వేల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**రాజేంద్రనగర్, అక్టోబరు5(నమస్తే ఉదయం):**
భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి బాబురావు ఆధ్వర్యంలో శనివారం బుద్వేల్ 161 బూత్‌లో బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సభ్యత్వం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ అసెంబ్లీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ డివిజన్ లో ప్రతి బూత్ లో 200 మంది చే సభ్యత్వ నమోదు చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ , ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానందం, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బి రాఘవేంద్ర చారి, డివిజన్ కార్యదర్శి సురేందర్, అధ్యక్షులు రాకేష్ గౌడ్, ప్రకాష్ నాయక్ , యాదయ్య , జలపాల మేఘనాథ్, స్వామి, పి రాజు తదితరులు పాల్గొన్నారు.

# భారీ సంఖ్యలో పార్టీ సభ్యత్వం చేయించాలి

## కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చాలి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భారీ సంఖ్యలో చేపట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి బాబురావు ఆధ్వర్యంలో బుద్వేల్ 161 బూతులో ఇంటింటికి బిజెపి సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ డివిజన్ లో ప్రతి బూతులో





200 సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ ,మక్తల్ అసెంబ్లీ ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ ,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానందం, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి, బిజెపి జిల్లా ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బి రాఘవేంద్ర చారి, డివిజన్ కార్యదర్శి సురేందర్ అధ్యక్షులు రాకేష్ గౌడ్, ప్రకాష్ నాయక్ ,యాదయ్య, జలపాల మేఘనాథ్, స్వామి ,పి రాజు, తదితరులు పాల్గొన్నారు.




మేడిపల్లిలో అగ్ని ప్రమాదంలో కాలిన ఇల్లు

# మేడిపల్లిలో అగ్ని ప్రమాదంతో కాలిన ఇల్లు

## విద్యుత్ సర్క్యూట్ వల్ల ప్రమాదం కాదు: ఏ ఈ రాజేష్ బాబు

**మొయినాబాద్, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** మొయినాబాద్ మండలంలోని మేడిపల్లిలో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం... మేడిపల్లి గ్రామానికి చెందిన కావాలి యాదయ్య ఇంట్లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఇంటికి తాళం వేసి పొలం పనులకు యాదయ్య కుటుంబ సభ్యులు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.అయితే స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో హుటా హుటిన అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. చిలుకూరు విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్ బాబు సిబ్బందికి సరఫరా నిలిపివేయాలని సూచించారు. ఇదిలా ఉండగా తమ ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించిందని కావలి యాదయ్య పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

### విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరగలేదు: ఏ ఈ రాజేష్ బాబు

మేడిపల్లిలో కావలి యాదయ్య ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగి ఉండవచ్చని విద్యుత్తు షాట్ సర్క్యూట్ వల్ల జరగలేదని చిలుకూరు విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్ బాబు తెలిపారు. తమ సిబ్బంది అగ్ని ప్రమాదం జరిగిన యాదయ్య ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారని అయితే విద్యుత్తు సర్క్యూట్ వల్ల జరగలేదని అగ్నిప్రమాదం వల్ల మంటలు చెలరేగి ఉంటాయని ఏఈ రాజేష్ బాబు తెలిపారు.




విద్యుత్ మీటర్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

# జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులను పెంచాలి

## జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాలకు పూర్తి శాంక్షన్ పోస్టులు భర్తీ చేయడమే కాక విద్యార్థుల సంఖ్యను బట్టి పెంచాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):**
దేశంలో అత్యంత వెనుక బాటుతనానికి గురైన గద్వాల జిల్లాకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలనినడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ కోరారు. గట్టు, కేటి దొడ్డి మండలాలకు మంజూరైన పూర్తి పోస్టులను కేటాయిస్తూనే, ఉపాధ్యాయ నియామకాలను పెంచాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ కోరారు. ఉపాధ్యాయ పోస్టులను పెంచాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాలకుల నిర్లక్ష్యం చేత అక్షరాస్యతలో వెనుకబాటు తనానికి గురై, దశాబ్దాలుగా ఈ ప్రాంతం విద్యకు నోచుకోబడలేదని అన్నారు. జిల్లాలోని గట్టు, కేటి దొడ్డి మండలాలు ఆసియా ఖండంలోనే అక్షరాస్యతలో అత్యంత వెనుకబాటుకు గురయ్యాయని, ఉపాధ్యాయుల కొరత వల్ల సరైన విద్య అందక, ముఖ్యంగా పేద వర్గాల పిల్లలు మధ్యలోనే చదువు ఆపే పరిస్థితి నెలకొందన్నారు. గట్టు, కేటి దొడ్డి మండలాలలో చాలా గ్రామాలలో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల డ్రాప్అవుట్స్ పెరుగుతున్నాయని ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా శాంక్షన్ అయినాపోస్టులను పూర్తిగా భర్తీ చేయాలన్నారు.




జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయ పోస్టులను పెంచాలని కోరారు. జిల్లాలో బాల కార్మికులు పెరిగిపోతున్నారని, దీని నిర్మూలనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యకు సంబంధించి ప్రత్యేక కార్యచరణ ప్రకటించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్ రాజు రంగస్వామి, వెంకట్ రాములు, రాముడు,మల్దకల్, అడవి ఆంజనేయులు,గోపాల్, మీసాల కిష్టన్న,బలిజరాజు రమేష్,లక్ష్మన్న, సుదర్శన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రులకు నోటీసులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారులు, ప్రోగ్రామ్ ఎన్ సిడి అధికారి డాక్టర్. జె.సంధ్య కిరణ్మయి, ప్రోగ్రామ్ ఆఫీసర్-మాత శిశు సంరక్షణ అధికారిణి డాక్టర్ ప్రసూన రాణి, NCVBDC ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు, వైద్య సిబ్బంది శనివారం గద్వాలలోని సాయి కృప హాస్పిటల్‌ని మరియు కేపీఎన్ హాస్పిటల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారులు సాయి కృప హాస్పిటల్ యాజమాన్యం వారు రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, నెలవారీ రిపోర్టులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సకాలంలో సమర్పించనందుకు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ -2010 , రూల్స్-2011 ప్రకారం ప్రతి ప్రవేట్ హెల్త్ కేర్ ఫెసిలిటీలో తప్పనిసరి ప్రవేట్ హెల్త్ కేర్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, క్వాలిఫైడ్ డాక్టర్ సర్టిఫికెట్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బయో మెడికల్ వేస్ట్ సర్టిఫికెట్, పొల్యూషన్ బోర్డ్ సర్టిఫికెట్ ,డిస్ప్లే చేయాలని సూచించారు. అదే విధంగా ప్రతి ప్రైవేట్ హెల్త్ కేర్ ఫెసిలిటీ తప్పనిసరిగా ఓపి రిజిస్టర్, ఐపీ రిజిస్టర్, కె - షీట్స్, డెలివరీ రిజిస్టర్ (నార్మల్ మరియు సి - సెక్షన్ రిజిస్టర్స్), ఎం టి పి రిజిస్టర్, ల్యాబ్ రిజిస్టర్, రెఫరల్ రిజిస్టర్ , విజిటర్స్ రిజిస్టర్, మొదలగునవి తప్పనిసరిగా నిర్వహించాలని, సిటిజన్ చార్టర్,



ప్రైస్ లిస్ట్ డిస్ప్లే చేయాలని, అదేవిధంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. PCPNDT యాక్ట్- 1994 ప్రకారం గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసిన తర్వాత ఫామ్-ఎఫ్‌లో వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. అదేవిధంగా, ఫామ్-ఎఫ్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రతినెల 5 తేది లోపల అందజేయాలన్నారు. గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ కొరకు ప్రత్యేకంగా రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ ఎడ్యుకేషన్ మీడియా అధికారి కె. మధుసూదన్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.





పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళ అర్పిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నీలం మధులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

# పండుగల సాయన్న ఆశయాల కోసం ముందుకు సాగాలి

## తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

## విగ్రహావిష్కరణ వార్షికోత్సవనికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**మొయినాబాద్,05(నమస్తే ఉదయం):** పండుగల సాయన్న ఆశయాల కోసం ముందుకు సాగాలని తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శనివారం చేవెళ్ల చౌరస్తాలో గల పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల ఆశాజ్యోతి బడుగు బలహీన వర్గాల వీరుడు సూర్యుడు పండగ సాయన్న ఆనాడు గ్రామంలో పెత్తందారులు, దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి అరాచకాలను అడ్డుకున్నారన్నారు. భూస్వాములు అడ్డు లేకుండా ఉండేదని, దొరల దగ్గర వంగి వంగి నడవాల్సి వచ్చేది ఎదురు తిరిగి మాట్లాడే వారు కారు అన్నారు.

ఈ పరిస్థితిలను చూసి పండగ సాయన్న ఉద్యమాలు చేశారన్నారు. ధనవంతులను భూస్వామిని కొట్టి పేదలకు పెట్టమన్న ఒక సూత్రాన్ని ద్వారానే అధిపతి శక్తులపై యుద్ధం చేయటం పండగ సైన్ అభిమతం ఉన్నది యుద్ధం చేసే క్రమంలో ప్రజలను చైతన్య పరచాలి. పెద్ద నీతి అవగతం చేసుకొని సాయన్న ప్రజాక్షేత్రంలో ఆయుధం పట్టుకున్నాడు అన్నారు సాయన్న పరిణతికి చెందిన బహుజన వీరుడు జ్ఞానపదుడు.చెలాయిస్తున్నాయో గుర్తించి ఎదుర్కొనడానికి సిద్ధమయ్యాడు అన్నారు.

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేన బీమ్ భరత్ నీలం మదు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు బైరమోని మల్లేష్ తలారి మల్లేష్ రవికుమార్ బిత్తిరి సత్తి ,చేవెళ్ల షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల అధ్యక్షుడు ఊరడి నరసింహులు, లింగం, యాదయ్య, శంకర్ పల్లి మైసయ్య నాయకులు శ్రీరాములు, ఆర్ యాదయ్య, శివ రాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, గోపాల్, వెంకటేష్ వివిధ మండలాలకు చెందిన ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):**
కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరన్న ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ సంస్కృతిక సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటాపాటల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంకు కళాశాల ప్రిన్సిపల్ వీరన్న ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ పండుగ గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీరన్న మాట్లా డుతూ.. తెలంగాణలో బతుకమ్మ పండుగ సంప్రదాయంగా వస్తున్న ఒక గొప్ప సంస్కృతి అని కొనియాడారు.బతుకమ్మలో తెలంగాణ పల్లె జీవితం కనిపిస్తుందని తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ప్రాధాన్యత మరువలేనిది అని అయన పేర్కొన్నారు.ముందుగా విద్యార్థులు గునుగు, తంగేడు, బంతి పూలతో పాటు వివిధ రకాలపూలతో బతుకమ్మలను అందంగా పేర్చి కలశాల ప్రాంగణంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీజే చప్పుల్ల మధ్య బతుకమ్మ పాటలకు అధ్యాపకులు విద్యార్థులతో కలిసి నృత్యాలు చేశారు. బతుకమ్మలను స్థానికంగ ఉన్న నది అగ్రహారం లో ఉన్న నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలోబతుకమ్మలతో మహిళలు

# మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



బృందావన్ కాలనీలో బీజేపీ సభ్యత్వం అందచేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. చిత్రంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, అక్టోబరు5(నమస్తే ఉదయం):** రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ బృందావన్ కాలనీ తో పాటు పలు ప్రాంతాల్లో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధి లోని ప్రతి బూత్‌లో 400 మంది చొప్పున సభ్యత్వం చేయాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా 20 వేల సభ్యత్వాన్ని టార్గెట్ చేసుకోవాలన్నారు. బీజేపీ పార్టీలో చేరడానికి యువత సిద్ధంగా ఉందన్నారు. డివిజన్ లో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించి మంచి మెజారిటీని అందించారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆడికే జనార్ధన్, బూత్ కో- ఆర్డినేటర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.



మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ జీ.వెంకట స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

# కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు జి.వెంకటస్వామి


**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు గడ్డం వెంకటస్వామి అని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. శనివారం ఐ.డి.ఓ.సి అవరణలో కలెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధుడు, కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి, మలిదశ ఉద్యమాల్లో ఎంతో ముఖ్యపాత్ర పోషించారని, కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు కాపాడేందుకు, వారి జీవితాల్లో మంచి మార్పు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సంకల్పం, పట్టుదల, ప్రజల పట్ల ఆయనకున్న అనురాగం అందరికీ ఆదర్శప్రాయమని, నేటి తరాలకు ఆయన జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.లక్ష్మి నారాయణ, ఏ.ఓ. వీర భద్రప్ప, జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ ,ఇంచార్జ్ బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ బాబు, ఎస్.సి సంక్షేమ శాఖ అధికారి సరోజమ్మ, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్ రెడ్డి

## మార్కెట్ యార్డ్ నూతన పాలక మండలిని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఈ మేరకు కమిటీ చైర్మన్ గా చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లుగా డి అంజయ్య, ఎం లక్ష్మి,



చిలుక మధుసూదన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రఘుపతి రెడ్డి, సి నరసింహ, మచ్చేందర్ రెడ్డి, ఎం గణేష్ నాయక్, పీ జైపాల్ రెడ్డి, కె స్వప్నరాజ్, బి మధుసూదన్ రావు, బి గోవర్ధన్ రెడ్డి, ఎండి ఇబ్రహీం, జి వెంకటేశ్వర్లు గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు.

సభ్యులందరికీ పెగ్లి పూర్ గ్రామం నుంచి కోట లక్ష్మారెడ్డి , పిగ్లిపూర్ గ్రామపంచాయతీ మాజీ వార్డ్ మెంబర్లువార్డు మెంబర్లు జక్కుల కుమార్, బత్తుల ఐలయ్య, హుస్సేన్, జనిగల ఎర్రయ్య, వర్ధన్ పోచయ్య, బచ్చి గళ్ళ జంగయ్య, తదితరులు ప్రమాణ స్వీకారం మహోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




# మూసీ నిర్వాసితుల జీవనోపాధిపై ప్రభుత్వం సంచలన నిర్ణయం

**హైద్రాబాద్, అక్టోబర్5(నమస్తే ఉదయం):** అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మహా నగరంలోని అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపేందుకు హైడ్రాను తీసుకొచ్చింది. అలాగే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కోసం కూడా అనేక చర్యలు తీసుకుంటుంది.ఇందులో భాగంగా ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతాల్లో సర్వే నిర్వహించి..తొలగించాల్సిన ఇండ్లకు మార్క్ కూడా చేశారు.అయితే ఇక్కడే ప్రభుత్వానికి ప్రజలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

పేద,మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూలిస్తే..రోడ్డున పడతారని నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం కీలక నిర్ణయం తీసుకుంది.

మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీ చైర్మన్‌గా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ను నియమించగా..ఈ ప్రత్యేక కమిటీలో 14 మందికి చోటు కల్పించినట్లు శనివారం సాయంత్రం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## అధికారులను మార్చడంపై ఉన్న ధ్యాస...


# అభివృద్ధిపై లేదు

## దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దింపే రోజులు దగ్గర పడ్డాయి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులకు అధికారులను మార్చడంలో ఉన్న ద్యాస శ్రద్ధ అభివృద్ధిపై లేదని బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు ఆరోపించారు. శనివారం మల్దకల్ మండల కేంద్రంలో బీఅర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఈ సందర్భంగా హన్మంతునాయుడు మాట్లాడుతూ..

దొంగ హామీలతో.. అమలుకాని గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో అవస్థలు పడుతున్న ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ వెన్నంటి నిలుస్తుందని, రాబోవు రోజులలో బీఅర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి యేడాది కావొస్తున్న గడుస్తున్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని మండిపడ్డారు. స్థానికంగా ఉన్నటువంటి కాంగ్రెస్ నాయకులు గ్రూపులుగా విడిపోయి వారి సొంత లాభాల కోసమే పార్టీలో ఉంటున్నారని, ఢిల్లీకి ఒక్కరు...



హైదరబాద్‌కు మరొక్కరు తిరుగుతు వాళ్ల వ్యక్తి గత ప్రయోజనాలు పొందుతున్నారని ఆరోపించారు. జిల్లా పాలన గాడిపడకుండా ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందకుండా కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ అధికారులను మార్చడంలో పోటీ పడుతున్నారని ఎద్దేవ చేశారు.

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ప్రజలంతా గమనిస్తున్నారని రాబోయే కాలంలో మళ్ళీ కేసీఆర్ సీఎం అవుతారని అన్నారు. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా ఉంటామని ప్రజ సమస్యలపై పోరాడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్ నాయుడు, మోనేష్, బస్వ రాజు, రాము, మల్దకల్ మండలంలోని పలు గ్రామాల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





శంషాబాద్ మున్సిపల్ నూతన కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలు: మంత్రి శ్రీధర్ బాబు

**శంషాబాద్, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం శంషాబాద్ నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఓం శంషాబాద్ మున్సిపల్‌లోని హుడా కాలనీలో సుమారు 6 కోట్ల రూపాయలతో నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ...మున్సిపల్ శంషాబాద్‌ను సుమారు 100 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేశామని ఇంకా రేవంత్ రెడ్డి నాయకత్వంలో శంషాబాద్ మున్సిపల్‌ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని అలాగే ముఖ్యమంత్రి సహాయంతో శంషాబాద్ లో మండలంలోని గ్రామాలలో భూ సంబంధ సమస్యలను కూడా పరిష్కరింప చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, కలెక్టర్ శశాంక్ మున్సిపల్ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్ యాదవ్,కమిషనర్ సుమంత్రావ్ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.




విద్యుత్ మింట్ కాంపౌండ్ వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాలలో జిఎం తులసి,ఉద్యోగ సంఘం నేత రమేష్

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ ఉత్సవాలు ప్రతీక: జిఎం తులసి

## మహిళా అధికారులు, ఉద్యోగులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**హైదరాబాద్, అక్టోబర్ 5(నమస్తే ఉదయం):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ ఉత్సవాలు ప్రతీక అని టీజీ ఎస్పీడీసీఎల్ జీఎం తులసి అన్నారు. శనివారం టి జి ఎస్ పి డి సి ఎల్ (మింట్ కాంపౌండ్) లో బతుకమ్మ వేడుకలను మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సిబ్బంది ఘనంగా నిర్వహించారు. జిఎం తులసి నేతృత్వంలో మహిళ అధికారులు, ఉద్యోగుల ఆటపాటలతో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో సీఎం డి ముషారఫ్, డైరెక్టర్ ఫైనాన్స్ (ఇంచార్జ్) సుధా మాధురి, పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి రత్నాకర్ రావు, సంఘం నాయకులు మేడి రమేష్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళా అధికారులు, ఉద్యోగులు


Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. “RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733